## చాట్‌జీపీటీకి పోటీగా 'గూగుల్ జెమిని'

న్యూయార్క్, డిసెంబర్ 18: కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో సంచలనాలకు కేంద్రమైన చాట్‌జీపీటీకి పోటీగా సెర్చింజన్ గూగుల్ కొత్తగా 'గూగుల్ జెమిని' పేరిట అడ్వాన్స్‌డ్ ఏఐ మోడల్ చాట్‌బోట్‌ను ఆవిష్కరించింది. ఇది టెక్ట్స్, ఫొటో, ఆడియో, వీడియో, కోడింగ్ తదితర అంశాలపై యూజర్లకు 90 శాతం కచ్చితత్వంతో కూడిన సమాధానాలు అందిస్తుందని గూగుల్ తెలిపింది. జెమిని 1.0 వర్షన్ పేరిట మూడు వేరియంట్లు జెమిని ఆల్ట్రా , జెమిని ప్రో , జెమిని నానోను అందుబాటులోకి తెచ్చామని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. శాస్త్రీయ పరిశోధన పత్రాల్లో గ్రాఫ్‌లు, గణాంకాలను రూపొందించే గూగుల్ జెమిని.. విద్యార్థుల రోజువారీ హోంవర్క్‌లోనూ సహాయ పడుతుందని వెల్లడించారు.

## ఇరాన్‌లో సైబర్ దాడి.. స్తంభించిన గ్యాస్ స్టేషన్లు

టెహ్రాన్: ఇరాన్‌లోని 70 శాతం గ్యాస్ స్టేషన్లలో సేవలు సోమవారం నిలిచిపోయినట్లు ప్రభుత్వ టీవీ తెలిపింది. సాఫ్ట్‌వేర్ సమస్య వల్ల సేవలకు విఘాతం కలిగినట్లు చెప్పింది. ఇది సైబర్ దాడి అయి ఉండవచ్చునని తెలిపింది. ప్రస్తుతం పని చేస్తున్న గ్యాస్ స్టేషన్లకు పెద్ద సంఖ్యలో వెళ్లవద్దని ప్రజలను కోరింది. అయితే ఇజ్రాయెల్ మీడియా మాత్రం ఈ సమస్యకు కారణం హ్యాకర్లేనని ఆరోపించింది. గొంజెష్కె దరాండే లేదా ప్రిడేటరీ స్పారో సైబర్ దాడి చేసి ఉండవచ్చునని తెలిపింది. ఇరాన్‌లోని గ్యాస్ స్టేషన్లు, రైల్వేలు, పరిశ్రమలపై సైబర్ దాడులు ఇటీవల పెరుగుతున్నాయి.

## స్వలింగ జంటలను ఆశీర్వదించవచ్చు: పోప్

వాటికన్ సిటీ: పోప్ ఫ్రాన్సిస్ సోమవారం కీలక రూలింగ్‌ను ఆమోదించారని వాటికన్ తెలిపింది. స్వలింగ జంటలకు ఆశీర్వాదాల కార్యక్రమాన్ని రోమన్ క్యాథలిక్ మత బోధకులు నిర్వహించేందుకు ఆమోదం తెలిపారని చెప్పింది. అయితే నిత్యం చర్చిలో జరిగే ప్రార్థనల్లో భాగం కానంత వరకు ఈ కార్యక్రమాలను నిర్వహించవచ్చునని చెప్పినట్లు తెలిపింది. ఇది దేవుడు అందరినీ స్వాగతిస్తాడని చెప్పే సంకేతం మాత్రమేనని స్పష్టం చేసినట్లు వివరించింది.

# రోజుకు 30 మంది రైతుల ఆత్మహత్య

- నరేంద్ర మోదీ పాలనలో అన్నదాతల బలవన్మరణాలు
- జాతీయ నేర గణాంకాల సంస్థ నివేదిక



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశంలో సగటున రోజుకు 30 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదక చెబుతున్నది. ఇటీవల విడుదలైన ఆ నివేదిక ప్రకారం 2014-2022 మధ్యలో 1,00,474 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 2022 గణాంకాల ప్రకారం రోజుకు 154 మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కానీ బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే మాత్రం మోదీ హయంలో ఒక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకోలేదన్నారు. రైతుల ఆత్మహత్యలపై ప్రతిపక్షాలు ఒక్కసారి కూడా పార్లమెంటులో చర్చించలేదని, అంటే రైతులెవరూ ఆత్మహత్యలు చేసుకోలేదంటూ వాదించడం గమనార్హం.

### పెరిగిన రైతుల ఆత్మహత్యలు

ఎన్‌సీఆర్‌బీ రిపోర్టు ప్రకారం రైతుల ఆత్మహత్యలు గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 4 శాతం పెరిగాయి. 2021లో 1,64,033 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా, 2022లో ఆ సంఖ్య 1,70,924కు పెరిగింది. గత అయిదేండ్లలో అన్నదాతల బలవన్మరణాలు 27 శాతం పెరిగాయి. 2019 తో పోల్చితే 2020లో వ్యవసాయ రంగంలో ఆత్మహత్యలు 18 శాతం పెరిగాయి.

### గిట్టుబాటు ధర లేక పోవడమే

నేడు వ్యవసాయంలో ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం, అందుకు తగ్గట్టుగా పంటకు గిట్టుబాటు ధర లభించక పోవడంతో రైతులు రుణగ్రస్తులుగా మిగిలిపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ భీమా యోజన అస్తవ్యస్తంగా, లోపభూయిష్టంగా ఉన్నది. రైతులకు నష్టపరిహారం అందించే బదులు, అది బీమా కంపెనీలకు లాభదాయకంగా మారింది.

**2022లో రైతుల ఆత్మహత్యలు అత్యధికంగా ఉన్న రాష్ట్రాలు**

| రాష్ట్రం | ఆత్మహత్యలు |
|---|---|
| మహారాష్ట్ర | 2,640 |
| కర్ణాటక | 1,170 |
| ఆంధ్రప్రదేశ్ | 481 |

### తెలంగాణలో తగ్గిన రైతు ఆత్మహత్యలు

ఒకప్పుడు రైతు ఆత్మహత్యలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండే తెలంగాణ ప్రాంతంలో, ప్రత్యేక రాష్ట్రమేర్పాటు తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్తు, ప్రతి ఎకరాకు ఏడా



భారీ వర్షాల కారణంగా నీట మునిగిన తిరునల్వేలిలోని ఒక ప్రాంతం

# దక్షిణ తమిళనాడు విలవిల

**భారీ వర్షాలతో అతలాకుతలం**

చెన్నై, డిసెంబర్ 18: భారీ వర్షాలు, వరదల తాకిడికి దక్షిణ తమిళనాడు కకావికలమైంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కన్యాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడి, టెంకాశి జిల్లాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. సోమవారం ప్రజలెవ్వరూ ఇండ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. వివిధ చోట్ల జరిగిన ప్రమాద ఘటనల్లో ఆరుగురు చనిపోయారని సమాచారం. లోతట్టు ప్రాంతాల నుంచి 7వేల మందిని దగ్గర్లోని పాఠశాలలు, మ్యారేజ్ హాల్స్‌కు విపత్తు నిర్వహణ సిబ్బంది తరలించింది. రైళ్ల రాకపోకలు నిలిచిపోవటంతో, తూత్తుకుడి జిల్లాలోని శ్రీవైకుంఠం వద్ద 800 మంది రైలు ప్రయాణికులు చిక్కుకుపోయారు.

# కమ్ముకొస్తున్న కరోనా!

మొదటిపేజీ తరువాయి...

ఉమ్మడి చర్యల వల్లే కరోనా వ్యాప్తిని కట్టడి చేశామని, అయితే కొవిడ్-19 వైరస్ వ్యాప్తి చెందుతూనే ఉన్నదని, ఈ మహమ్మారి ప్రవర్తన భారత వాతావరణ పరిస్థితులు, ఇతర సాధారణ వ్యాధి కారకాలతో స్థిరత్వం పొందిందని ఆరోగ్యశాఖ కార్యదర్శి సుధాంశు పంత్ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో కేరళ తదితర రాష్ట్రాల్లో కేసులు స్వల్పంగా పెరుగుతుండటాన్ని ప్రస్తావించారు. రాబోవు పండుగ సీజన్ నేపథ్యంలో వైరస్ మరింతగా వ్యాప్తి చెందకుండా రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇన్‌ఫ్లూయెంజా వంటి కేసులను పర్యవేక్షించాలని, జిల్లాల వారీగా నివేదించాలని సూచించారు. తద్వారా కేసుల పెరుగుదల ట్రెండ్‌ను ముందే గుర్తించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

### కొత్త వేరియంట్ నుంచి వ్యాక్సిన్ల రక్షణ

జేఎన్.1 ఇన్ఫెక్షన్ ఇతర వేరియంట్ల కంటే భిన్నంగా వ్యాధి లక్షణాలను కలుగజేస్తుందా అనే దానిపై స్పష్టత లేదని కేంద్రం పేర్కొన్నది. జేఎన్.1 తీవ్రత పెరిగే సూచన కూడా లేదని, ప్రస్తుతానికి ఉన్న ఇతర వేరియంట్లతో పోలిస్తే జేఎన్.1 ప్రజారోగ్యానికి ఎక్కువ ముప్పు కలిగిస్తుందనేందుకు ఎలాంటి ఆధారాలు లేవని తెలిపింది. కొవిడ్-19 సోకిన వారికి ఇప్పుడు ఇస్తున్న ట్రీట్‌మెంటే జేఎన్.1కు కూడా సమర్థంగా పనిచేస్తుందని, అప్‌డేటెడ్ వ్యాక్సిన్లు కొత్త వేరియంట్ నుంచి రక్షణ కల్పిస్తాయని భావిస్తున్నట్టు పేర్కొన్నది.



కేరళలోని ఎర్నాకుళం ప్రభుత్వ దవాఖానలో మాస్కులు ధరించిన సందర్శకులు

### లాక్‌డౌన్ దిశగా సింగపూర్?

సింగపూర్‌లో భారీగా కొత్త కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఆ దేశం మరోసారి లాక్‌డౌన్ దిశగా సాగుతున్నది. డిసెంబర్ 3-9 మధ్య వారం వ్యవధిలో ఏకంగా 56,043 కొత్త కేసులు నమోదు కాగా, ఈ సంఖ్య అంతకుముందు వారం 32,035గా ఉన్నది. దీంతో ఆ దేశ ఆరోగ్య శాఖ అడ్వైజరీని అప్‌డేట్ చేసింది. తాజా అడ్వైజరీ ప్రకారం ప్రజలు అనారోగ్యంగా లేకున్నా బహిరంగ ప్రాంతాల్లో తప్పనిసరిగా మాస్కులు ధరించాలని ఆదేశించింది. కేసుల పెరుగుదల నేపథ్యంలో సింగపూర్ ఎక్స్‌పో హాల్‌లో రెండో కొవిడ్ చికిత్స కేంద్రాన్ని కూడా ఆరోగ్య శాఖ తెరువున్నదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మలేషియాలో భారీగా కొవిడ్ కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. డిసెంబర్ 10-16 మధ్య 20,696 కేసులు నమోదయ్యాయి. ముందస్తు చర్యలు తీసుకొంటున్నామని పేర్కొన్న ఆరోగ్య మంత్రి అహ్మద్..లాక్‌డౌన్ విధించనున్నదని వార్తలను ఖండించారు.

## కరోనాపై అప్రమత్తంగా ఉండాలి

**అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశం**

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): పొరుగు రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు పెరుగుతున్నందున రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశించారు. అధికారులు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలన్నారు. ముఖ్యంగా కేరళలో జేఎన్.1 వేరియంట్ వెలుగుచూసిన నేపథ్యంలో శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాబోయే పండుగల సీజన్ దృష్ట్యా ప్రజలు అవసరమైన మేరకు మాస్కులను ధరించాలన్నారు. కొవిడ్‌ను ఎదుర్కొనేందుకు రాష్ట్ర యంత్రాంగం పూర్తిగా సిద్ధంగా ఉందని, వ్యాధినిర్ధారణ పరీక్షలకు కావాల్సిన కిట్స్, చికిత్సకు అవసరమైన మందులు ఆక్సిజన్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# వేగంగా వ్యాప్తి చెందే స్వభావం

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబరు 18 (నమస్తే తెలంగాణ): ఒమిక్రాన్ సబ్ వేరియంట్ బీఏ.2.86 నుంచి వచ్చిన మరో ఉప వేరియంటే ఈ 'జేఎన్.1'. జేఎన్.1(పిరోల) అనే కొత్త కరోనా వేరియంట్‌కు వేగంగా వ్యాప్తి చెందే స్వభావం ఉన్నదని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఈ వేరియంట్ భారత్‌తో సహా 38 దేశాలను చుట్టేసిందని, మన దేశంలో కూడా కేరళతో పాటు కర్ణాటక, మహారాష్ట్రకు సైతం జేఎన్.1 వేరియంట్ వ్యాపించినట్టు వార్తలు వస్తున్నాయని వైద్యాధికారులు తెలిపారు. ఒమిక్రాన్ ఉపవేరియంట్ బీఏ.2.86లోని స్పైక్ ప్రొటీన్‌లలో 20 మ్యుటేషన్‌లు ఉండగా దాని ఉపవేరియంటైన జేఎన్.1 (పిరోల) వైరస్‌లోని స్పైక్ ప్రొటీన్స్‌లో 21మ్యుటేషన్‌లు ఉన్నట్లు వైద్యనిపుణులు వివరించారు. బీఏ.2.86 వేరియంట్‌కు, జేఎన్.1 వేరియంట్‌కు కేవలం ఒక స్పైక్ ప్రొటీన్ మ్యుటేషనే తేడా ఉందని, ఈ మ్యుటేషన్‌ల వల్లనే వైరస్‌కు వేగంగా వ్యాప్తిచెందే స్వభావం ఉంటుందంటున్నారు వైద్యులు.

### జేఎన్.1 వేరియంట్ లక్షణాలు

సాధారణ జలుబు, సాధారణ జ్వరం, దగ్గు, ముక్కు కారడం, తలనొప్పి, ఒంటి నొప్పులు, నీరసం, కళ్లు ఎర్రబడడం, కడుపులో నొప్పి, సాధారణ వైరల్ ఫీవర్ లక్షణాలు ఉంటాయి.

### జాగ్రత్తలు తప్పనిసరి

ప్రస్తుతం మన దగ్గర 'ఇన్‌ఫ్లుయెంజా' కేసులు పెద్దగా లేవు. రెస్పిరేటరీకి సంబంధించిన లక్షణాలతో కూడిన కేసులు పెద్దగా నమోదు కావడం లేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే. గాంధీ దవాఖానలో కరోనా వార్డు కొనసాగిస్తున్నాం.

– డాక్టర్ రాజారావు, గాంధీ దవాఖాన సూపరింటెండెంట్

### ప్రత్యేక లక్షణాలేవీ లేవు

జేఎన్.1 వేరియంట్‌కు సంబంధించి ప్రత్యేక లక్షణాలేవీ లేవు. 90 శాతానికి పైగా ప్రజలు వ్యాక్సినేషన్ చేసుకోవడం వల్ల జేఎన్.1ప్రభావం ఇక్కడి ప్రజలపై పెద్దగా ఉండే అవకాశాలు లేవు. వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి.

– డాక్టర్ కిరణ్ మాదాల, నిజామాబాద్ ప్రభుత్వ దవాఖాన క్రిటికల్ కేర్ నిపుణులు

